



**జరిగిన జగన్నాటకం**

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. మరణదండన నుంచి ద్వీప, ఆచార్య వేదాంతం కాపాడారు. రెండుసార్లు దళాధిపతి దాడి నుంచి ఉగ్ర కాపాడాడు. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. మహాబసుపై దళాధిపతి చేసిన దాడిలో సుధాముడు మరణించాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు మహాబసుని రహస్య మార్గం ద్వారా బయటికి తీసుకెళ్ళిపోయాడు. మహాబసు మరణించాడన్న పుకారు గుప్పుమంది. ఉద్యమాన్ని ఆపేయాలని ద్వీప, కొనసాగించాలని ఉగ్ర వాదించుకుంటున్నారు. మహాబసు రహస్యాలు తెలిసినట్లు మాట్లాడాడు డాక్టర్ నరసింహం.

- 23 –

"మహాబసు మరణించాడని చెప్తున్నారు. మరణించలేదని కూడా కొందరు వాదిస్తున్నారు. ఇందులో ఏది నిజమో ఏది అబద్ధమో చర్చించడం అనవసరం. ఒకవేళ మరణించకపోయి వుంటే ఈపాటికల్లా మహాబసు మన ముందుకు వచ్చేవాడు. ఒకవేళ మరణించకపోయినా వామదేవుడి బందీగా మారి వుంటాడు. ఆయన నాయకత్వం లేకుండా ఈ పోరాటాన్ని కొనసాగించడం అసాధ్యం. మహాబసు అంటే దైవికమైన శక్తి. మనందరిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన దీప్తి. ఆయన లేకుండా పోరాడటం వృధా ప్రయాస. తల లేని మొండెం ఎలాంటిదో మహాబసు లేకపోతే మనం కూడా అంతే. మనం ఇప్పుడు శాంతి కాముకులుగా మారాలి. యుద్ధం వద్దని ప్రకటించాలి...."

ద్వీప చెప్తున్న ఒక్కొక్క మాట వాడి బాణంలా ఉగ్ర గుండెల్లో దిగబడుతోంది. మహాబసు మరణ వార్త విన్న తరువాత ద్వీప, మహాబసుల మధ్య జరిగిన వాగ్వివాదం మొత్తం గుర్తుకువచ్చింది అతనికి. ఆ తరువాత వామదేవుడు యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాడని తెలిసి ఆ విషయాన్ని వదిలిపెట్టి తాను కూడా యుద్ధసన్నాహాలలో మునిగిపోయాడు. ఈలోగా ద్వీప మహాబసు మరణం నిజమేననీ, అందువల్ల పోరాటాన్ని ఆపి సంధి చేసుకోవాలనీ సైనికులలో, ప్రజలలో ప్రచారం చెయ్యడం మొదలుపెట్టింది. ఆ విషయం వేగుల ద్వారా తెలుసుకున్న ఉగ్ర ఆమెతో మాట్లాడాలని అక్కడికి వచ్చాడు.

ద్వీప మాటలు వింటుంటే పరిస్థితి చెయ్యి జారిపోయిందని అతనికి అనిపించసాగింది. ఆమెతో చర్చించి పరిష్కరించవచ్చన్న ఆలోచనే రద్దు చేసుకున్నాడు. మహాబసు మరణాన్ని పూర్తిగా నమ్మి, అతను లేని పోరాటం వ్యర్థమని ప్రచారం చేస్తోంది. నాయకుడు మరణించాడన్న వార్త విని హతాశులైన సైనికులు, ఆమె మాటలను నమ్ముతున్నారు. యుద్ధం చెయ్యగలమన్న నమ్మకం అణగారిపోయి, సంధి చేసుకోవడమే ఉత్తమమన్న ఆలోచనలోకి జారుకుంటున్నారు. ఈ పరిస్థితిలో ద్వీపతో చర్చించడం అనవసర ప్రయాస, కాలయాపన. చేయదగ్గది ఒకటే..!

ఉగ్ర స్థిరంగా ఒక నిర్ణయానికు వచ్చినట్లు తలాడించి, భుజానికి తగిలించి వున్న విల్లంబుని అందుకోని, బాణాన్ని దూరంగా కనపడుతున్న ద్వీప మీదకు గురిపెట్టాడు. బాణంతో సహా వింటినారిని లాగి ఇక వదులుతాడనగా జరిగిందా సంఘటన.

ద్వీప సైనికుడి దుస్తుల్లో వున్న ఒక వ్యక్తిని జనంలో నుంచి ముందుకు లాగి అందరి ముందూ నిలబెట్టింది.

"ఇతన్ని చూడండి" అరిచిందామె గట్టిగా.

అతనికి రెండు చేతులూ లేవు.

"యుద్ధం ఇతనికి బహూకరించిన బహుమతి ఈ అవిటితనం. కుడి చేతిని వాడాలా? ఎడమ చేతిని వాడాలా? అని పోరాటం చేస్తున్నాం మనం. ఇప్పుడు ఇతని రెండు చేతులూ లేవు. ఇతనేం చెయ్యాలి? ఈ యుద్ధం ఇతనికి సాధించిపెట్టేదేమిటి? కుడి చేతిని వాడే ప్రపంచాన్ని సాధిస్తానని బయల్దేరి చివరి చేతులే లేని చోటుకి చేరుకున్నాడు. ఇతనేం చెయ్యాలి?"

దూరం నుంచి చూస్తున్న ఉగ్ర ఒక్క క్షణం తటపటాయింపుకు లోనయ్యాడు. లోపల ఏదో అలజడి మొదలైనట్లు అనిపించింది. విల్లంబుని నెమ్మదిగా కిందకు దించాడు.

"మనం కూడా ఇదే పరిస్థితిలోకి జారుకుంటున్నామేమో అన్న అనుమానం కలుగుతోంది. కుడిచేతికోసం ఎడమచేతిపైన పోరాటం. చివరికి మనమంతా ఇలాగే చేతులులేని వాళ్ళమైతే అప్పుడు మనం సాధించిన దాన్ని విజయం అంటారా అపజయం అంటారా? వద్దు. మన ఆప్తుల్ని, మన స్నేహితుల్ని బలిగా కోరే యుద్ధం మనకి వద్దు. ఒక కుటుంబం నుంచి ఒక తండ్రిని, ఒక భర్తని, ఒక బిడ్డని వేరు చేసే ఈ పోరాటం అవసరం లేదు మనకి. రండి, మనం అందరం కలిసి నినదిద్దాం. పోరాటం వద్దు. శాంతి కావాలి." ఆవేశంగా అరుస్తోంది ద్వీప.

ఉగ్రకి ద్వీప మీదకు బాణం వెయ్యాలని అనిపించలేదు. అలాగని ఆమె చెప్పిన విషయాలని సమర్థిస్తున్నాడని కాదు. ఎటూ తేల్చుకోలేని ఇరుకున వున్నట్లుగా కొద్ది క్షణాలు విలవిలలాడాడు. మరుక్షణం అతనికి మహాబసు గుర్తుకొచ్చాడు. అతను రగిల్చిన పోరాట స్ఫూర్తి గుర్తుకువచ్చింది.

"అయితే యుద్ధం లేకపోతే మరణం. సంధికి అవకాశమే లేదు" మనసులోనే అనుకున్నాడు ఉగ్ర. అతని వెనుకే వున్న నలుగురు అనుచరుల్ని చూశాడు. వాళ్ళిద్దరూ ఒక ఉదుటున ముందుకు అడుగేసి నిలబడ్డారు.

"మీరిద్దరూ ద్వీపని బంధించండి. జాగ్రత్త ఇప్పుడు ఆమె చుట్టూ వున్న వారిలో ఆమె పట్ల సానుభూతి వున్నవాళ్ళు చాలామంది వున్నారు. మీ పని కొంత కష్టమయ్యే అవకాశం వుంది. అవసరమైతే మరో నలుగురి సహాయం తీసుకోండి. కాని ఈ రోజు రాత్రికే జరిగిపోవాలి." అతని ఆదేశాలను విన్న ఇద్దరు అనుచరులు "జయహో" అంటూ అక్కడ్నుంచి కదిలారు.

మిగిలిన ఇద్దరి వైపూ చూశాడు ఉగ్ర. విడివిడిగా ఇద్దరికీ సందేశాన్నిచ్చాడు.

"నువ్వు వెంటనే ఆచార్య వేదాంతాన్ని కలిసి, ఈ రోజు సాయంత్రం ఆయన్ని కలవాలనుకుంటున్నానని చెప్పు. ఇక నువ్వు మన సేనానాయకులందరికీ చెప్పు – రేపే ఆఖరి యుద్ధమని. విజయమో, వీరస్వర్గమో. సైన్యాన్ని సమాయత్తపరచమని చెప్పు. ఈ రోజు సాయంత్రం ఆచార్య వేదాంతంతో జరిగే సభకు వారిని కూడా ఆహ్వానించానని చెప్పు." అతని మాటలు పూర్తి అవుతుండగానే ఇద్దరు అనుచరులూ తలలు వంచి నమస్కరించారు. "జయహో" అంటూ నినదిస్తూ ముందుకు సాగారు.

ఉగ్ర నెమ్మదిగా ముందుకు కదిలి తన గుర్రాన్ని అధిరోహించి తన శిబిరం వైపు సాగిపోయాడు.

<★★★>

మహాబసు కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా ఉదంతుడు కనిపించాడు.

"ఎలా వుంది?" అడిగాడతను మహాబసు కళ్ళు తెరవడం చూస్తూనే.

మహాబసు సమాధానం చెప్పలేదు. పరిసరాల గమనిచాలని ప్రయత్నించాడు.

ఏదో రాజమహల్ లాగా వుంది. అక్కడ వున్న ప్రతి వస్తువులోనూ దాని విలువతో పాటు దర్పం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. కారాగారంలో వుంటానని ఊహించిన మహాబసు ఇప్పుడున్న ప్రదేశాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"భయపడకండి. మీరు క్షేమంగా వున్నారు. వామదేవుడి ఆంతరంగిక మందిరంలో వున్నారు. మీకు ఎలాంటి హాని జరపకుండా అతిధి మర్యాదలతో చూసుకోమని వారి ఆజ్ఞ. ఇంతకీ మీకు ఎలా వుందో చెప్పనేలేదు" నవ్వుతూ అడిగాడు.

"నాకు బాగానే వుంది. కానీ, నన్ను ఇక్కడ వుంచడంలో ఆంతర్యం"

"ఆంతర్యం తెలిసినా చెప్పే అర్హత నాకు లేదు మహాబసు. అది స్వయంగా వామదేవులవారే వచ్చి తెలియజేస్తారు" అంటూ వంగి నమస్కరించాడు. ఇక మహాబసుకి వేరే మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా – "మరి నాకు శలవా?" అంటూ అక్కడ్నుంచి నిష్క్రమించాడు ఉగ్ర.

మహాబసు లేచి నిలబడ్డాడు. చుట్టూ పరికించి చూశాడు. ఆ మందిర ద్వారానికి రెండు వైపులా నిలబడ్డ ఇద్దరు సైనికులు మినహా ఇంకెవ్వరూ లేరు. రెండు విషయాలు అతన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి – పట్టుబడ్డ శత్రువుని చంపకుండా, కారాగారంలో వేసి బంధించకుండా ఇలా రాచమర్యాదలతో ఎందుకు ఉంచుకున్నారు? అంతకన్నా ఆశ్చర్యకరంగా వున్నది ఉదంతుడి ప్రవర్తన. అప్పటిదాకా తనతో యుద్ధ ఖైదీతో మాట్లాడినట్లు మాట్లాడిన ఉదంతుడు, ఈ మందిరంలోకి వచ్చిన తరువాత సేవకుడిలా మాట్లాడటమేమిటి?

సమాధానం దొరకని ప్రశ్నల గురించి ఎంత ఆలోచించి సమాధనం వెతికినా, స్ఫురించిన సమాధానాలన్నీ ఊహలే తప్ప నిజం కాదని అతనికి అనిపించసాగింది. క్రమంగా ఆ ఆలోచనలన్నీ జారుకోని ద్వీప జ్ఞాపకం వచ్చింది.

ద్వీప! ద్రోహి!

అతనికి వెంటనే స్ఫురించిన పదం. ఉద్యమానికి, తనకి కూడా ద్రోహం చేసిన ద్రోహి. పోరాటాన్ని నిలిపేయలన్న ద్వీప పిలుపు వింటే ఇంతవరకూ జరిగినదంతా వృధా అయిపోతుంది. ద్వీప మాట అందరూ వింటారని కాదు కానీ, ఏ కొద్ది మంది విన్నా వారి వల్ల సైన్యం ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. ఉద్యమం బలహీనపడుతుంది. ఇదంతా ద్వీపకు తెలియదని కాదు. తెలిసే చేస్తోంది. ఎందుకు? ఎందుకు?

ముఖద్వారం దగ్గర ఏదో అలికిడి అయ్యింది. వామదేవుడు వచ్చి స్వయంగా ఏదో తెలియజేస్తాడని ఉదంతుడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చి లేచి స్థిరంగా నిలుచున్నాడు.

ద్వారం తెరుచుకుంది. అందులో నుంచి లోపలికి వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు మహాబసు. ఆ వచ్చింది మహాబసు కాదు. ఎవరో శతాధిక వృద్ధుడు. తెల్లటి రంగు. తెల్లటి జుట్టు. తెల్లటి బట్టలు. సన్నటి శరీరం. ముడుతలు పడ్డా చర్మం. కొంచెం ముందుకు వంగటం వల్ల చేతులు

వేలేడుతుంటే వడి వడిగా అడుగులు వేసుకుంటూ వచ్చాడాయన. నేరుగా మహాబసు నిలబడ్డ చోటుకే వచ్చి తల పైకెత్తి చూశాడు. ఆ తరువాత ఒక్కో అడుగు నెమ్మదిగా వేస్తూ, మహాబసునే చూస్తూ అతని చుట్టూ తిరిగాడు. మళ్ళీ అతనికి అభిముఖంగా వచ్చి, అతని రెండు చెంపలమీద తన రెండు అరచేతులని వుంచి అన్నాడు –

"సందేహం లేదు. నీవే మహాబసు. జయ జయహో మహాబసు" అంటూ చేతులు జోడించాడు.

"మీరు పెద్దవారు. నాకు నమస్కరించడమేమిటి?" అంటూ ఆశ్చర్యపోతూ అడిగాడు మహాబసు.

"వయసు కాదు ప్రధానం. ఎన్నో ఏళ్ళుగా మేమంతా ఎదురుచూసిన దేవుడివి నువ్వు. నీ వల్ల ఈ సవ్యలంకకి జరగబోతున్న మేలు తెలిసినవాడిని కాబట్టే నీకు నమస్కరిస్తున్నాను" అన్నాడాయన

"నేను దేవుణ్ణి అన్న నమ్మకమే ఇంత దూరం తీసుకువచ్చింది. నేను మీరనుకుంటున్న మహాబసుని కాదని తెలుసుకుంటున్న సమయంలో మీరు వచ్చి నేనే మహాబసునని చెప్తున్నారు. అసలు మీరు ఎవరు?"

"నా పేరు జ్ఞాతి" చెప్పాడాయన అక్కడే ఆసీనుడౌతూ.

జ్ఞాతి అన్న పేరు ఎక్కడో విన్నట్లు అనిపించింది మహాబసుకి. గుర్తు చేసుకున్నాడు. జ్ఞాతి, విజ్ఞాతి. అన్నదమ్ములు. ఆచార్య వేదాంతం గారి గురువులు. పోరాటం అజ్ఞాతంగా చేస్తున్నప్పుడు అడవిలో కనిపించిన రణచండి దేవాలయం గురించి చెప్తూ వీళ్ళ గురించి ప్రస్తావించాడాయన.

"అంటే మీరు ఆచార్య వేదాంతం గురువులు. మీతోపాటు విజ్ఞాతి అని.."

"చనిపోయాడు. నా తమ్ముడు. నిన్ను కలిసే భాగ్యం నాకుండబట్టి నేను మిగిలాను. నూటా పద్దెనిమిది ఏళ్ళు. ఈ ఒక్క రోజు కోసమే బ్రతికానేమో" నవ్వాడాయన.

ఆశ్చర్యంగా ఆయన్ని చూస్తూ ముందుకు వచ్చి ఎదురుగా కూర్చున్నాడు మహాబసు.

"నేను మహాబసుని కాదు... దయచేసి నన్ను అంత గొప్పవాణ్ణి చెయ్యకండి" తనలో వున్న ఆవేదన అంతా గొంతులో వినిపిస్తూ పలికాడు.

"గొప్పవాణ్ణి ఒకళ్ళు చెయ్యడమేమిటయ్యా? నువ్వు చేసే పనే నిన్ను గొప్పవాణ్ణి చేస్తుంది. నీ వెనుక ఎంతమంది నడిచారు అన్నదానిబట్టి నువ్వు నాయకుడివి అవుతావు కానీ, నీకు నువ్వుగా నాయకుడినని ప్రకటించుకోలేవు. ఇప్పుడు నేను చెప్పడం కాదు. కాలం ముందు ముందు చెప్పుకుంటుంది. కానీ... కానీ..." ఏదో భయాందోళన కమ్మేసినట్లు ఆగిపోయాడాయన.

"ఏమైంది?" మహాబసు కూడా ఆందోళనగా అడిగాడు.

"ప్రళయం. మహాప్రళయం... మహాబసు సవ్యలంక పోరాటంలో శత్రువుని జయించిన రోజు మహాప్రళయం సంభవిస్తుందని మహాజ్ఞాన గ్రంధంలో చెప్పబడింది"

"మహాజ్ఞాన గ్రంధమా? అవును దీని గురించి జలపతి, వేదాంతం కూడా ప్రస్తావించేవారు. జలప్రళయం సంభవిస్తుందని..."

"అవును. అది నిశ్చయం. మహాబసుగా నీవు శత్రువులపై విజయం సాధించడం నిశ్చయం. అది జరిగిన మరుక్షణం మహాజలప్రళయం వచ్చి ఈ లంక మొత్తాన్ని ముంచెత్తి ఎడమచేతి వాళ్ళని అందరినీ మింగేసి ఒక కొత్త సమాజాన్ని నిర్మించడం ఖచ్చితం. ఇదే సత్యం." చెప్పుకుంటూపోయాడాయన.

"ఏమంటున్నారు జ్ఞాతీ? అక్కడ సైన్యంలో ఈపాటికే తిరుగుబాటు మొదలై వుంటుంది. నేను నమ్మిన వాళ్ళు, నన్ను నమ్మిన వాళ్ళే నేను మహాబసుని కాదని ప్రచారం చేస్తున్నారు. నేను చనిపోయానని నమ్ముతున్నారు. నేను ఇక్కడ మీరు చెప్పిన శత్రువు దగ్గర బందీగా వున్నాను. నేను శత్రువుని జయించడం సాధ్యమా?"

గట్టిగా నవ్వాడు జ్ఞాతి.

"నీవు శత్రువు దగ్గర బందీగా వున్నావా? నీకు ఈ మందిరం కారాగారంలా అనిపిస్తోందా? ఇక్కడ నువ్వు అతిధిగా వున్నావు. నిన్ను కాపాడేందుకే ఇక్కడికి తీసుకొచ్చి పెట్టారు తప్ప నిన్ను బంధించి కాదు" ఆయన చెప్పిన మాటలు విని ఆశ్చర్యంగా చూశాడు మహాబసు.

"అంటే వామదేవుడు నన్ను బంధించలేదా?"

"వామదేవుడు నిన్ను ఎందుకు బంధిస్తాడని అనుకుంటున్నావు?"

“అదేమిటి? ఈ పోరాటంలో నా శత్రువు వామదేవుడే కదా?”

“వామదేవుడు నీ శత్రువు అనే భ్రమలో వున్నావు నువ్వు. నువ్వు నమ్మలేని నిజం ఒకటి చెప్పనా? వామదేవుడు కుడిచేతి వాటం వున్న వ్యక్తి”

ఆశ్చర్యంతో పాటు అపనమ్మకం కూడా జోడై అలాగే చూస్తూ వుండిపోయాడు మహాబసు.

“అవును. ఈ రహస్యం చెప్పాలనే నేను ఇంతకాలంగా ఎదురు చూస్తున్నాను. వామదేవుడు జన్మతః కుడిచేతి వాటం వున్నవాడు. కేవలం ఈ రాజ్యం, రాజ్యం నిర్మించిన చట్టం, అతనికి ఇవ్వబడిన అధికారాల కారణంగా అతను ఎడమచేతిని వాడాల్సి వచ్చింది. ఒక రాజుగా అతనే చట్టాన్ని అతిక్రమిస్తే రాజ్యమే అల్లకల్లోలమైపోతుందని స్వభావ రీత్యా కుడిచేతిని వాడవలసినవాడు ఎడమ చేతినే వాడుతూ అలాంటి పరిస్థితి దాపురించినందుకు ప్రతి క్షణం మధనపడుతుంటాడు. అందుకు ప్రత్యక్ష సాక్షిని నేనే”

మహాబసు ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోయాడు.

“అయితే మా పైన పోరాటం? నిరాయుధులై, శాంతి కాముకులై పోరాడుతున్న సత్యోద్యమకారులను హతమార్చడం? ఇదంతా ఏమిటి?” అడిగాడు ఆవేశంగా.

“అనివార్యమైన ఒక దుస్సంఘటన. ఒక పీడకలగా మారి అనునిత్యం వెంటాడిన మహాభూతం. ఒక మహారాజుని ప్రాయోపవేశానికి సిద్ధం చేసిన పాపం”

ఆ మాటలు అన్న వైపుకి చూసిన మహాబసు స్థాణువులా వుండిపోయాడు. అక్కడ మోకరిల్లి వున్నాడు – వామదేవుడు.

★★★

డాక్టర్ నరసింహం పదం పదం కూడగట్టుకోని చెప్పడం మొదలుపెట్టాడు.

“ఆ ప్రపంచంతో నీకే కాదు, నాకు కూడా సంబంధం వుంది. మొదట తెలిసేది కాదు. కానీ నువ్వు నీ కథ చెప్పడం మొదలుపెట్టిన తరువాత క్రమక్రమంగా నేను కూడా అందులో భాగమేమని అర్థం అయ్యింది. ఆ తరువాత స్పష్టంగా తెలిసిపోయింది...”

డాక్టర్ నరసింహం మొదటి వాక్యం విన్న దగ్గరే అగిపోయాడు సారథి.

“ఆ ప్రపంచంలో మీ పేరేమిటి డాక్టర్?” అడిగాడు

“ఆచార్య వేదాంతం”

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS